క్లుప్తంగా

విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలని గైనకాలజిస్ట్ ఆర్.సోమలత అన్నారు. స్థానిక శారద జూనియర్ కళాశాల్లో 'సఖి' అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమంలో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పీసీఓడీ సమస్యలను వివరించారు. రోజూ ఎంత నీరు తాగాలి? ఏయే ఆహార పదార్థాలు తీసుకోవాలి? తదితర విషయాలపై అవగాహన కల్పించారు. సరైన మోతాదులో నీరు తాగకపోవడం వలన కలిగే ఇబ్బందులను తెలియజేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సదస్సులో శారదా కళాశాల అధ్యాపకులు హరిత, జ్యోత్స్న, కనకరత్నం పాల్గొన్నారు.

వైభవాన్ని చాటుతున్న సంగీత మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. విఖ్యాత సంగీత విద్వాంసులు ప్రయోక్త పోపూరి గౌరీనాథ్ శుక్రవారం నిర్వహించిన కచేరీ శృతిలయ సమన్వితంగా సాగింది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ కృతి అమ్మా ఆనందదాయని, త్యాగరాజ స్వామి కృతి ఎందరో మహానుభావులు తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై రామానుజాచార్యులు, మృదంగంపైకే సద్గురు చరణ్, మోర్సింగ్‌పై బెంగళూరు రాజశేఖర్ సహకరించారు. శనివారం విఖ్యాత విదుషీమణి ఐశ్వర్యా విద్యార ఘునాథ్ గాత్ర కచేరీ నిర్వహించనున్నారు.

ఘంటసాల ఆడిటోరియం నిర్మించండి

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రాజధానిలో గాయకుడు ఘంటసాల పేరుతో ఆడిటోరియం నిర్మించాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్యవేదిక, ఆది లీలా ఫౌండేషన్ తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే ఘంటసాల జయంతి వేడుకలు, 10 సంవత్సరాల నవ్యాంధ్ర రాష్ట్ర సదస్సు, సినీ సంగీత విభావరి కార్యక్రమాలు గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి ఆదిలీలా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ ఆదినారాయ మాట్లాడుతూ తెలుగువాడి గుండె చప్పుడు ఘంటసాల అన్నారు. అనంతరం అభిమానుల సదస్సును చింతకాయల చిట్టిబాబు ప్రారంభించారు. బోడి ఆంజనేయరాజు, షబానా, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయకులు ఘంటసాల ఆలపించిన చిత్ర గీతాలను ఆలపించారు. అనంతరం రాష్ట్ర సదస్సు బ్యానర్‌ను ఆవిష్కరించారు.

ఏఐఎల్ఆర్ఎస్ఏ నూతన కమిటీ ఎన్నిక

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) విజయవాడ డివిజన్ కార్యవర్గ సమావేశం శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సింగ్‌రావు విచ్చేసి ప్రసంగించారు. రైల్వే కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైల్వే ప్రైవేటీకరణ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. యూపీఎస్ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని, లోకో పైలట్‌లకు 46 గంటల వారాంతపు సెలవులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏఐఎల్ఆర్ఎస్ఏ విజయవాడ డివిజన్, విజయవాడ బ్రాంచ్ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ విజయవాడ డివిజన్ నూతన అధ్యక్షుడిగా ఎం.వెంకటేషన్, డివిజనల్ కార్యదర్శిగా ఆర్.వి రాముతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులతో పాటుగా ఏఐఎల్ఆర్ఎస్ఏ బ్రాంచ్ నూతన అధ్యక్షుడిగా ఎస్.ఎస్.వి రావు, బ్రాంచ్ సెక్రటరీగా బి.గౌరిప్రసాద్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాకపోకలను పునరుద్ధరించరా?



దేవీనగర్‌లో రోడ్డును మూసివేసిన దృశ్యం



ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

- వందల మంది రాకపోకలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల సమయంలో బుడమేరు ఏలూరు కాలువ మధ్య గండిపడింది. పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో విజయదుర్గా నగర్ నుంచి కేఎల్ రావునగర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బుడమేరు ఉద్ధృతి తగ్గి సాధారణ స్థితి ఏర్పడినప్పటికీ ఇక్కడ రోడ్డును మాత్రం పునరుద్ధరించలేదు. తుతూమంత్రంగా కొద్దిమేర మట్టిని పోసి వదిలివేశారు. నెలలు గడిచినప్పటికీ కనీసం రాకపోకలకు వీలుగా రోడ్డును మాత్రం సరి చేయలేదు. మట్టిని పోసిన ప్రాంతం మీదుగానే గోతులు, మట్టిదిబ్బల మధ్య ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. మట్టి దిబ్బలమీదుగా వెళ్లలేని వారు చుట్టూ తిరిగి వెళ్తున్నారు. పక్కనే ఉన్న బుడమేరు వంతెన వద్దకు వెళ్లాలన్నా మధురానగర్ మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

నత్తనడకన యూజీడీ పైపులైన్ పనులు

దేవీనగర్ రైల్వేట్రాక్ సమీపంలో యూజీడీ పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. యూజీడీ పైపులైన్ పనుల్లో భాగంగా తవ్విన గోతులు పూడ్చకపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఒక పక్క బుడమేరు మధ్యకట్టలో రోడ్డును సరిచేయకపోవటంతో పాటు మరోపక్క దేవీనగర్‌లో పైపులైన్ పనుల్లో భాగంగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాకపోకలకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది



బుడమేరు వరద తగ్గి నెలలు గడిచినా బుడమేరు గండిని మాత్రం సరిచేయలేదు. దీంతో కనీసం పక్కనే ఉన్న మధ్యకట్టలో కేఎల్ రావునగర్‌కు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ బుడమేరు గండిని ఇంత వరకు సరిచేయకపోవటం విచారకరం. ఈ ప్రాంతం నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నానాయాతన పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వి.యేసుపాదం, స్థానికుడు, రామకృష్ణాపురం

దేవీనగర్ వద్ద రాకపోకలు బంద్



అసలే ఒక పక్క బుడమేరు గండి ప్రాంతంలో రోడ్డును సరిచేయక ఇబ్బందులు పడుతుంటే.. ఇప్పుడు యూజీడీ పైపులైన్ పనులలో భాగంగా దేవీనగర్ వద్ద రాకపోకలు నిలిపివేశారు. దీంతో అత్యవసర సమయాల్లో గమ్యస్థానాలకు చేరుకోవటానికి ఇబ్బందులు పడుతున్నాం. తిరిగి వెళ్లేందుకు సమయం, ఇంధనం వృథా అవుతోంది. ప్రమాదకరంగా వెళ్తూ ఒక్కోసారి గాయాలబారిన పడుతున్నాం.

– బి.చిన్ని, స్థానికుడు, ముత్యాలంపాడు

ఘనంగా సహస్ర దీపోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని శుక్రవారం సహస్ర దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివపార్వతులు, ఓం, శివలింగం, అర్ధనారీశ్వరులు తదితర చిత్రాలను గీసి దీపాలను వాటికి అనుగుణంగా వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేశారు. ఆలయ అర్చకులు కార్తిక మాసంలో దీపారాధన విశిష్టతను వివరించారు.



రామకృష్ణాపురంలో సహస్ర దీపోత్సవం



ఇందిరా ఎన్‌క్లేవ్‌లో సహస్ర దీపోత్సవం

కనులపండువగా శివ కల్యాణం

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో శివకల్యాణం కనులపండువగా జరిగింది. శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

ఇందిరా ఎన్‌క్లేవ్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఇందిరా ఎన్‌క్లేవ్‌లో దివి మధుసూదనాచార్యులు ఆధ్వర్యంలో సహస్ర దీపోత్సవం కనులపండువగా జరిగింది. శివలింగం, ఓమ్, శంకు, చక్రం ఆకారంలో దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ జి. ఈశ్వర్ ప్రసాద్, శ్రీనివాస్, శరత్‌చంద్ర, సాంబశివరాజు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం



రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు



భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా స్వామికి అన్నాభిషేకం జరిగింది. ఆలయ అర్చకులు స్వామికి విశేషంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దాత ఎస్.సుబ్రహ్మణ్య గుప్తా, శ్రీవల్లి తదితరుల సహకారంతో ఐదువేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు దాట్ల వెంకటనరసింహరాజు, బడేటి ధర్మారావు, చిరంజీవి, ఐఎస్ఎన్ రాజు తదితరులు పర్యవేక్షించారు.

కార్పొరేటర్లకు ల్యాప్‌ట్యాప్‌లు

వీఎంసీ కౌన్సిల్ తీర్మానం

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలు కార్పొరేటర్లు సభలో చర్చించారు. నగరంలో నిత్యం ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య నిర్వహణతోపాటు పలు సమస్యలను మేయర్ రాయన భాగ్యలక్ష్మి చర్చించారు. కార్పొరేటర్ల ప్రశ్నలకు, ఎజెండాలో పొందుపరచిన అంశాలపై అధికారుల నుంచి సమాధానాలు రాబట్టి సభకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అధికారులకు ప్రజలు, కార్పొరేటర్ల నుంచి వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పునరావృత్తం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. వీఎంసీలో 2004 నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన సీపీఎస్ ఖాతాలో ఎంప్లాయిస్ షేర్ వాటా సొమ్మును వారి ప్రాన్ ఖాతాకు జమ చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని సభ్యులు చేసిన ప్రతిపాదనపై కమిషనర్ స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని సాంకేతిక సమస్యలున్నాయని, వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

■ వీఎంసీ నిర్వహణలోని స్కూళ్ల అభివృద్ధి మాత్రం అంతంతమాత్రంగా ఉందని... పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని వచ్చిన ప్రతిపాదనపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి స్పందిస్తూ గతంలో పాఠశాలల నిర్వహణను వీఎంసీ చూసేదని, కానీ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అదనపు తరగతులు, మౌలిక వసతులు అన్నీ విద్యా సంస్థల నిర్వహణ విద్యాశాఖకు అప్పగించామని తెలిపారు. నాడు–నేడు అనంతర పరిణామాల నేపథ్యంలో స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు డీఈవోతో చర్చించి తర్వాత కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆమె సభలో సూచించారు.

■ స్మార్ట్ గవర్నెన్స్‌లో భాగంగా పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్ అమలుకు వీఎంసీ కార్పొరేటర్లందరికీ ల్యాప్‌ట్యాప్‌లు అందించాలని అందుకు రూ.65.66 లక్షలు నిధులు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.

■ నగరంలోని కృష్ణలంకలోని రాణిగారితోట ప్రాంతంలో నిరంతరం యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) సమస్య ఉత్పన్నమవుతుందని, ఈ ప్రాంతం నుంచి రామలింగేశ్వరనగర్ వరకు వెళ్లే యూజీడీ తరచూ మరమ్మతులకు గురవుతుందని, దీన్ని నియంత్రించేందుకు బైపాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కావటం లేదని కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ప్రశ్నించారు. దీంతో సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఆ ప్రాంతంలో యూజీడీ సంప్ ఏర్పాటు చేసి మురుగునీటి పారుదలకు మోటార్లు ఏర్పాటు చేయాలని కౌన్సిల్లో తీర్మానించారు.

బుడమేరు గండిని వెంటనే పూడ్చాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు గండిని వెంటనే పూడ్చి, రాకపోకలకు వీలుగా రోడ్డును సరిచేయాలని సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక బుడమేరు మధ్యకట్ట విజయదుర్గానగర్ గండి పడిన ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో బుడమేరు గండి పూడ్చాలంటూ శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండి పడి రెండు నెలలు దాటినా ఇంత వరకు పూడ్చకపోవటం అధికారుల బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో రాకపోకలకు గండి వల్ల నానాయాతన పడుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా ప్రజల అవస్థలను పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మధ్యకట్ట రోడ్డుకు పడినటువంటి గండిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రాకపోకలకు సౌకర్యం కల్పించాలని కోరారు. లేకుంటే రహదారి నిర్మించేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. తాము సేకరించిన సంతకాలను సోమవారం 'స్పందన'లో నగరపాలక సంస్థ కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 30వ డివిజన్ సీపీఎం కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు ఒకటో డివిజన్ కార్యదర్శి షకీలా, నాయకులు బెజ్జంకి ఝాన్సీ, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు

విజ్ఞాన సముపార్జనకు ప్రదర్శనలు దోహదం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజ్ఞాన సముపార్జనకు ప్రదర్శనలు దోహదపడతాయని నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. సూర్యారావుపేటలోని శ్రీధర్ సీసీఈ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో–2024ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, పురావస్తు శాఖ కమిషనర్ వాణిమోహన్, ఏజీ అడ్మిన్ జి.శ్రీకాంత్, సుమన్‌మీనా కరెన్సీ నోట్లకు సంబంధించిన ప్రదర్శనను ప్రారంభించారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన కాయిన్స్, నోట్లు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన స్పెషల్ కార్డ్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల నోట్లు, నాణేలు ఒకే చోట చూడడం సంతోషంగా ఉందన్నారు. ప్రదర్శన విద్యార్థులు ఎంతో మేలు చేస్తుందన్నారు. మన పూర్వికులు ఏ విధమైన కరెన్సీ వినియోగించారు. ప్రస్తుతం ఎన్ని విధాలుగా రూపాంతరం చెందింది అనే విషయాలు ఈ ప్రదర్శన ద్వారా తెలుసుకుంటారన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ప్రదర్శనలు మరిన్ని నిర్వహించాలన్నారు. నిర్వాహకులు శ్రీధర్ సీసీఈ చైర్మన్ కొమ్మూరి శ్రీధర్‌ను అభినందించారు. అనంతరం సీపీ రాజశేఖరబాబు, వాణీమోహన్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును నిర్వాహకులు సత్కరించారు.



ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో–2024ను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

హ్యాండ్ రైటింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సౌత్ ఇండియా హ్యాండ్‌రైటింగ్, కాలిగ్రఫీ ఎక్స్‌పర్ట్ అసోసియేషన్, కేరళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ చేతిరాత ఆన్‌లైన్ పోటీల్లో సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని దనిశెట్టి ధరణిప్రియ ఉత్తమ ప్రతిభను కనబర్చింది. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు రాగా, ధరణిప్రియ తృతీయ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు, పాఠశాల హెచ్ఎం పరసా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు శుక్రవారం ధరణిప్రియను అభినందించారు. విద్యాశాఖాధికారి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి 11,624 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ధరణి ప్రతిభను కనబర్చడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డులను అందజేస్తామన్నారు. జనవరి 22న జాతీయ చేతిరాత దినోత్సవం సందర్భంగా దేశస్థాయి చేతిరాత పోటీలకు ధరణిప్రియ ఎంపికైనట్లు ఆ సంస్థ కార్యదర్శి రవివర్మ తెలిపారు.



ధరణిప్రియను సన్మానిస్తున్న విద్యాశాఖాధికారి సుబ్బారావు, ఉపాధ్యాయులు









ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్

విజయవాడలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2024 ఉత్సాహంగా కొనసాగుతోంది. పోలీసు సిబ్బంది ఎంతో చలాకీగా ఆటల్లో పాల్గొంటున్నారు. రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. మహిళా పోలీసులు మ్యూజికల్ చైర్స్‌లో పాల్గొన్నారు. క్రీడాకారుల కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి ఉద్యోగులు సందడి చేస్తూ ఆటలో పాల్గొన్న వారిని ఉత్సాహం పర్చారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోటమనిగే ఆనంద్ డిమాండు చేశారు. శుక్రవారం సింగ్‌నగర్‌లో ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ కమిటీ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ మతం ఆధారంగా ఎస్సీ ప్రయోజనాలను తిరస్కరించడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. అనంతరం ఐసీసీ రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కోటమనిగే ఆనంద్, స్టేట్ కో–ఆర్డినేటర్ తేజస్‌కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ సత్యానందం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐసీసీ జాతీయ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్, వాలీబాల్ జట్ల ఎంపికకు సన్నాహాలు

విజయవాడస్పోర్ట్స్: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో వాలీబాల్ పురుషుల జట్టును ఈ నెల 30వ తేదీన ఏలూరులోని ఏఎస్ఆర్ఎం మెడికల్ కాలేజీలో, ఫుట్‌బాల్ పురుషుల జట్టును డిసెంబర్ రెండో తేదీన చినఅవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంపిక చేయనున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మెడికల్, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు ఆయా కాలేజీల పీడీలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన వాలీబాల్ జట్టు కేరళలోని తిరువనంతపురంలో డిసెంబర్ 18 నుంచి 22వ తేదీ వరకు, ఫుట్‌బాల్ జట్టు కాలికట్‌లో డిసెంబర్ 21 నుంచి 28వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.



ఇంటర్నేషనల్ కాయిన్స్ ఎక్స్‌పోకు పోటెత్తిన విద్యార్థులు, యువతీయువకులు



సౌరకుటుంబానికి చెందిన గ్రహాల పేరుపై ఉన్న నాణేలు



భారత దేశ కరెన్సీ నోట్లు



స్పెషల్ డేట్ చెబితే ఆ తేదీ నోట్ మనకు ఇలా అందించే పాత కరెన్సీ కౌంటర్ వద్ద..



మలేసియాకు చెందిన అతిపెద్ద నోట్



విజ్ఞానం.. వినోదం

విజయవాడ శ్రీధర్ సీసీఈలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో పేరిట శుక్రవారం ఏర్పాటు చేసిన నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపుల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శన మూడు రోజులు నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనకు శుక్రవారం విద్యార్థులు క్యూ కట్టారు. ఎక్స్‌పోలో మలేసియా 60వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద నోటు రింగిట్ మలేసియా(ఆర్ఎం 600) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పర్యావరణంపై 145 దేశాలు ముద్రించిన 613 రకాల నాణేలు, వైల్డ్‌లైఫ్‌పై వివిధ సందర్భాల్లో 120 దేశాలు ముద్రించిన నాణేలు వీక్షకులను కట్టిపడేస్తున్నాయి. వైల్డ్‌లైఫ్ విభాగంలో ఫ్లైయింగ్ ఫిష్ నాణేన్ని విద్యార్థులు ఫొటోలు తీసుకుంటున్నారు. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ సెంటెడ్ స్టాంపులు సువాసతో ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రదర్శన విద్యార్థులకు విజ్ఞాన సముపార్జనకు తోడ్పాటును అందిస్తోంది.

– గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/సాక్షి ఫొటోగ్రాఫర్